

వక్ఫ్‌బోర్డు పేరుతో భూముల కబ్జా

వక్ఫ్ బోర్డు పేరుతో మదనపల్లె పట్టణంలోని టిప్పు సుల్తాన్ మైదానంలో భూములు కబ్జా చేసి అనుమతి లేకుండా దుకాణాలు నిర్మించారని బాధితులు ఆరోపించారు. -8లో



మామిడి రైతుకు ఏదీ భరోసా?

ఈ సారి మామిడి విక్రయాలకు భరోసా లేకుండా పోతోంది. రాయచోటి, కోడూరులలో మార్కెటింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినా నేటికీ అమలు కాలేదు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.130	రూ.160
రెండోరకం	రూ.90	రూ.120



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 52 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	-	-
సీబీ	685	685



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 91.880 కిలోలు

న్యూస్‌రీల్

జిల్లా అధికారి పరిధిలోకి పది ఆలయాలు

బి.కొత్తకోట: జిల్లాలో 6–బి2 గ్రేడ్ కలిగిన పది ఆలయాలను దేవదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పరిధి నుంచి తొలగించి జిల్లా దేవదాయ ధర్మాదాయశాఖ అధికారి పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆలయాల పాలన ఇకపై జిల్లా అధికారి పరిధిలోకి వచ్చింది. జిల్లాలోని పీలేరు మండలం దొడ్డిపల్లిలోని చెన్నకేశవస్వామి ఆలయం, నిమ్మనపల్లి మండలం తవళంకు చెందిన నేల మల్లేశ్వరస్వామి ఆలయం, కురబలకోట మండలం తెట్టులోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయం, మదనపల్లిలోని సోమేశ్వర స్వామి ఆలయం, బి.కొత్తకోటలోని చెన్నకేశవ, ఆంజనేయస్వామి ఆలయాలు, చిన్నమండెం మండలం మల్లూరులోని మల్లూరమ్మ దేవత ఆలయం, రాజంపేటలోని ఆంజనేయస్వామి ఆలయం, కోడూరులోని భుజంగేశ్వర స్వామి ఆలయాల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు జిల్లా అధికారి పరిధిలోకి వచ్చాయి. ఈ ఆలయాలన్నింటిని కర్నూలు డిప్యూటీ కమిషనర్ పరిధి నుంచి తొలగించారు.

మైక్రో ఇరిగేషన్‌ను సద్వినియోగం చేసుకోండి

రాయచోటి టౌన్: మైక్రో ఇరిగేషన్ పద్ధతి ద్వారా వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని, ఏపీఎంఐపీ రాష్ట్ర స్థాయి ప్రత్యేక అధికారి (ఓఎస్‌డీ) రమేష్ అన్నారు. బుధవారం రాయచోటి నియోజక వర్గ పరిధిలోని రాయచోటి, రామాపురం, వీరబల్లె మండలాల్లో పర్యటించి క్షేత్ర స్థాయిలో మైక్రో ఇరిగేషన్ వ్యవసాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ భూమిని సాగు చేసుకొనే విధానంలో మైక్రో ఇరిగేషన్ ఒకటన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు మొత్తం 15000 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అయితే 9339 మంది రైతుల ద్వారా 9694 హెక్టార్లలో సాగు అవుతున్నట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని యుద్ధ ప్రాతిపదికన మార్చి ఆఖరులోగా పూర్తి చేయాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంఐఓ లక్ష్మీప్రసన్న, ఎంఐడీసీలు, ఎంఐఈ క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఫర్నిచర్ సరఫరాకు కొటేషన్లు ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప స్పెషల్ పోక్సో కోర్టు కోసం కొత్త ఫర్నిచర్ వస్తువుల సరఫరా కోసం సీల్డ్ కొటేషన్లు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి. శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అన్ని టాక్స్‌లతో కలుపుకొని 7 ఐరన్ అల్మారాలు, 1 ఐరన్ ర్యాక్, 8 ఆఫీసు టేబుల్స్, 3 కుషన్ చైర్స్, 30 'ఎస్' టైప్ మార్క్ చైర్స్, ఒక క్రోన్ చైర్, 5 ఐరన్ స్టూల్స్, 2 కోట్ హ్యాంగర్స్, 3 ఉడెన్ బెంచులు, ఒక సోఫా సెట్, 5 టీపాయి, ఒక డైనింగ్ టేబుల్, ఒక ప్లాస్టిక్ చైర్ మొత్తం 13 రకాల ఫర్నిచర్ వస్తువుల కోసం సీల్డ్ కొటేషన్లు ఆహ్వానిస్తున్నామన్నారు. టెండరుదారు సమర్పించే కొటేషన్ కవరు పైన 'కొటేషన్ ఫర్ సప్లయ్ అండ్ ఇన్‌స్టాలేషన్ ఫర్ ఫర్నిచర్ ఐటమ్స్'అని నమోదు చేసిన సంబంధిత షీల్డు కొటేషన్లను ఈనెల 21వతేదీ సాయంత్రం 5 గంటల లోపు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు, కడపలో సమర్పించాలన్నారు.

మదనపల్లె సబ్ కలెక్టరేట్‌కు ఐఎస్‌ఓ గుర్తింపు



ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి అందిస్తున్న కలెక్టర్, సబ్ కలెక్టర్

మదనపల్లి: వందేళ్లకు పైబడి ఘన చరిత్ర కలిగిన మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఐఎస్‌ఓ 9001:2015 సర్టిఫికేట్‌ను అందుకుంది. సబ్ కలెక్టరేట్ అగ్నిప్రమాద ఘటన తర్వాత ఆధునీకీకరించిన భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ.సిసోడియా, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. నూతన కార్యాలయ భవనంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెవెన్యూ, సాధారణ పరిపాలన, విపత్తు నిర్వహణ తదితర పాలనా విషయాలకు సంబంధించి, ఐఎస్‌ఓ 9001:2015 ప్రమాణాలను అనుసరిస్తూ, నాణ్యతతో కూడిన సేవలు ప్రజలకు అందించడంపై హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ మేనేజిమెంట్ సర్టిఫికెట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఫిబ్రవరి 17న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి అందించిన ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను, రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ.సిసోడియాకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

వేసవికి ముందే.. గొంతెండుతోంది!



- వేసవి ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య
- జిల్లాలోని అనేక గ్రామాలు, కాలనీల్లో ప్రారంభమైన నీటి కష్టాలు
- ప్రస్తుతం రాయచోటిలోనూ నీటిని కొనుగోలు చేస్తున్న ప్రజలు
- జిల్లాలో 10 సీపీడబ్ల్యుఎస్, 4896 పీడబ్ల్యుఎస్ స్కీములు, 8946 చేతి పంపులు
- వాటిలో 2980 పనిచేయక మూలన చేరిన వైనం
- ఎండా వేడిమి పెరిగే కొద్ది అడుగంటనున్న భూగర్భ జలాలు
- రానున్న కాలంలో తాగునీటికి ప్రజలకు తప్పని తిప్పలు



మంచినీటి కోసం బిందెలతో వెళుతున్న పాటూరు ఎస్టీ కాలనీ మహిళలు



సాక్షి రాయచోటి: వేసవి ప్రారంభానికి ముందే నీటి కష్టాలు ఆరంభమయ్యాయి. ఇప్పుడిప్పుడే సూర్యభగవానుడు ఒకవైపు మండుతుండగా, మరోవైపు ప్రజలు దాహంతో అలమటించే పరిస్థితి కనిపిస్తోంది. ఎండా వేడిమి ప్రభావం పెరిగే కొద్ది భూగర్భ జలాల మట్టం కూడా రోజురోజుకు అడుగంటుతోంది. దీంతో ప్రస్తుత సీజన్‌లో నీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికే అనేకచోట్ల తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లా కేంద్రమైన రాయచోటిలో 4–6 రోజుల మధ్య నీటిని అందిస్తున్నారు. అధికారులకు ముందుచూపు కొరవడటం, నీటి నిల్వలు అందుబాటులో లేకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడుతోంది. జిల్లాలోని కొన్ని గ్రామాలకు చెందిన ప్రజలు ఇటీవల సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు వచ్చి ఫిర్యాదులు కూడా చేశారు.

రాయచోటి మున్సిపాలిటీలో తప్పని కొనుగోలు

జిల్లా కేంద్రమైన రాయచోటిలోని పలు ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి మంచినీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. మున్సిపాలిటీ నుంచి నాలుగైదు రోజులకు ఒకసారి మాత్రమే నీటిని సరఫరా చేస్తుండడంతో చాలా కాలనీల్లో తప్పనిసరి పరిస్థితుల్లో అవసరాలకు నీటిని కొనుగోలు చేయక తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం అధికారులైనా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి నీటి సమస్య లేకుండా చూడాల్సింది పోగా ఇంతవరకు ఆ దిశగా దృష్టి సారించలేదు. దీంతో కొత్తపేటతోపాటు పలు ప్రాంతాల వాసులు నీటిని కొనుగోలు చేస్తున్నారు. నాలుగైదు రోజులకు సరిపడా నీటిని నిల్వ చేసుకోవాలన్నా కష్టం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్నామని పేర్కొంటున్నారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో నిర్మించిన వెలిగల్లు ప్రాజెక్టు పుణ్యమా అని అక్కడి నుంచి ఇక్కడికి వేసిన పైపులైన్ ద్వారా అంతో ఇంతో రాయచోటి పట్టణానికి నీరు చేరుతోంది. అయితే మరో పైపులైన్ పనులు కూటమి ప్రభుత్వం నిలిపి వేయడంతో నీటి ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో రానున్న కాలంలో తాగునీటి సంబంధించి మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు



జిల్లాలో వేసవి తాపం మొదలైంది. ఇప్పుడే ఎండల తీవ్రత అధికంగా ఉండగా, మార్చి నుంచి వేసవి తీవ్రత మరింత పెరగనుంది. 10 సీపీడబ్ల్యు, 4896 పీడబ్ల్యుఎస్ స్కీములు ఉన్నాయి. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా 8946 బోర్లు ఉండగా, అందులో 2980 మరమ్మతులకు గురయ్యాయి. రానున్న కాలంలో ఎండ ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటితే మిగిలిన బోర్లలో కూడా నీళ్ల లేక తాగునీటి కష్టాలు మరింత అధికం కానున్నాయి. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ప్రత్యేకంగా తాగునీటి సమస్య తీవ్రమయ్యే ప్రాంతాల్లో ప్రత్యేక బోర్లకు ప్రణాళికలు రూపొందించాలని ప్రజలు కోరుతున్నారు. ఎందుకంటే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో భూగర్భ జలమట్టం తగ్గిపోయి తాగునీటికి తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

కటకటకు కౌంట్‌డౌన్



అన్నమయ్య జిల్లాలో 500కు పైగా గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే వేసవి నేపథ్యంలో తాగునీటి కటకటకు కౌంట్‌డౌన్ మొదలవుతోంది. ప్రధానంగా నందలూరు మండలం పాటూరు గ్రామ పంచాయతీ వెంకట్రాదిపురం ఎస్టీ కాలనీలో గత కొన్నేళ్లుగా తాగునీటి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. అక్కడున్న ప్రజలు తాగునీటి కోసం ప్రతినిత్యం యుద్ధం చేస్తున్నారు. అక్కడే కాకుండా రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో చాలా గ్రామాల్లో సమస్య ఉత్పన్నమవుతోంది. ఇటీవల అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి కలెక్టరేట్‌కు వచ్చి పలు గ్రామాల ప్రజలు జిల్లాలోని ఉన్నతాధికారురులకు వినతులు సమర్పించారు. రానున్న కాలంలో పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా తాగునీటి సమస్య చాలాచోట్ల ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు



తాగునీటి కోసం నారాయణరాజుపేటకు వెళ్లాల్సి వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. దీంతో రోజువారీగా చేసుకునే పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దయచేసి అధికారులు, ప్రజా ప్రతినిధులు మాకు గుక్కెడు నీరు అందించి అన్ని విధాలా ఆదుకోవాలి. – చిన్నక్క, వెంకటాద్రిపురం ఎస్టీకాలనీ, పాటూరు గ్రామపంచాయతీ, నందలూరు మండలం

నీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలి



మా గ్రామంలోని తాగు నీటి సమస్యపై ఎన్నో మార్లు నాయకులకు విన్నవించుకున్నా పరిష్కారానికి నోచుకోలేదు. గ్రామంలో ఏర్పాటు చేసిన బోరులో కూడా ఒక్కొక్కసారి నీళ్లు రావడం లేదు. మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. తాగునీటి కోసం అష్ట కష్టాలు పడుతున్నాం. మా సమస్యను పరిష్కరిస్తే అంతే చాలు. – యాసగిరి లక్ష్మీదేవి, వెంకటాద్రిపురం ఎస్టీ కాలనీ, పాటూరు గ్రామపంచాయతీ, నందలూరు మండలం

ఒంటిమిట్ట క్షేత్రం రెండో అయోధ్యను తలపిస్తోంది

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్



అజయ్ జైన్‌కు ఒంటిమిట్ట ఆలయ శిల్ప సంపదను వివరిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయం రెండో అయోధ్యను తలపిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ (ఐఏఎస్) ప్రశంసించారు. బుధవారం ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయాన్ని ఆయన దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట పర్యాటక అభివృద్ధికి అనుకూలంగా ఉందని తెలిపారు. ఇక్కడ పర్యాటకులను ఆకర్షించే విధంగా ఒంటిమిట్ట చెరువులో నీటి వసతి కల్పిస్తే ట్యాంక్‌బండ్ తరహాలో బోటింగ్ నిర్వహించవచ్చన్నారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు ఆలయ చరిత్ర అన్ని భాషల్లో తెలిసే విధంగా క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేస్తే పర్యాటకులు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఆలయం అయోధ్య, వారణాసి తరహాలో పర్యాటకులకు ఆకర్షిస్తుందన్నారు. అలాగే ఇక్కడ ఉన్న హరిత రెస్టారెంట్‌ను పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళిక, మార్పులు చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. ఒంటిమిట్ట రామయ్య క్షేత్ర గోపురాలు మూసిపోయి ఉండడం గమనించి పురావస్తు శాఖ అధికారులు కెమికల్‌తో గోపురాలను శుద్ధిచేస్తే బాగుంటుందన్నారు. ఈయన వెంట జిల్లా పర్యాటకశాఖ అధికారి సురేష్ కుమార్, కడప ఆర్డీఓ జాన్ ఇరివిన్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఈశ్వరయ్య, డివిజనల్ మేనేజర్ మల్లికార్జున, ఒంటిమిట్ట తహసీల్దార్ వెంకటరమణమ్మ, ఆలయ టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ అంజనా గౌరీ ఉన్నారు.

'స్టాఫ్ నర్స్' ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

కడప రూరల్: కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు, వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. ఈ జాబితాను సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 22వ తేదీలోపు తమ అభ్యర్థనలను తెలపాలని సూచించారు. 28వ తేదీన ఫైనల్ మెరిట్ జాబితాను ప్రకటిస్తామని వివరించారు.

2600 మెట్రిక్ టన్నుల యూరియా రాక

కడప అగ్రికల్చర్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు బుధవారం 2600 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు వెల్లడించారు. వైఎస్సార్‌జిల్లాకు 1300 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రైవేటు డీలర్లకు కేటాయించగా మరో 1000 మెట్రిక్ టన్నుల యూరియాను మార్క్‌ఫెడ్‌కు కేటాయించామన్నారు. అన్నమయ్య జిల్లా మార్క్‌ఫెడ్‌కు 300 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించామన్నారు.

పోలీస్ శాఖపై విశ్వసనీయత పెంచాలి

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



జిల్లా నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

రాయచోటి: పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి పోలీస్ వ్యవస్థ గౌరవాన్ని పెంచాలని ఎస్పీ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై నిశితంగా సమీక్ష జరపాలని పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నేర నిరూపణలకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ నేర పరిశోధన చేయాలన్నారు.

రౌడీ షీట్ ఓపెన్ చేయాలి..

అలవాటు పడిన నేరస్తులపై రౌడీషీట్ కేసులు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

ఉక్కుపాదం మోపాలి..

జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలను నిర్వహించే వారిపట్ల కఠిన చర్యలు చేపట్టి ఉక్కుపాదం మోపాలని ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు చేయాలన్నారు. క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. గతంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో చైన్ స్నాచింగ్‌లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, నిషేధిత మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై యువతను, ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆదేశించారు.

ప్రజలతో మంచి సంబంధాలు..

విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాలలోని కాలనీలను సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి, మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అడ్మిషన్ల జోరు.. తల్లిదండ్రుల బేజారు!

'హలో సార్... మీ పాప రమ్య పదవ తరగతి చదువుతున్నది కదా..! ఇంటర్‌కు ఏం ప్లాన్ చేస్తున్నారు సార్? మాది ఫలానా కార్పొరేట్ కాలేజీ. ఐఐటీ, ఎంసెట్ కోచింగ్, ఏసీ, నాన్ ఏసీ స్పెషల్ బ్యాచ్‌లు ఉన్నాయి. హాస్టల్ సౌకర్యం కూడా ఉంటుంది. ఇప్పుడు జాయిన్ అయితే ఫీజులో కొంత డిస్కౌంట్ ఉంటుంది. పరీక్షల తర్వాత సీట్లు కష్టం. అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఫీజులు పెరుగుతాయి. ముందుగా సీటు రిజర్వ్ చేసుకుంటే బాగుంటుంది. ఒకసారి కాలేజీ క్యాంపస్‌ను విజిట్ చేసి చూడండి '.



'సార్ గుడ్ ఈవినింగ్, సురేష్ ఫాదరేనా? మీ అబ్బాయి ఇంటర్మీడియట్ చదువుతున్నాడు కదా. బీటెక్ కోసం ఏం ప్లాన్ చేశారు. తమిళనాడు, కేరళలోని ఫలానా యూనివర్సిటీల్లో బీటెక్ కంప్యూటర్ సైన్సు, ఏఐఎంఎల్, డేటా సైన్సు, మెకానికల్ తదితర కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి.. ఆసక్తి ఉంటే చెప్పండి... రాయితీలు ఇప్పిస్తాం'...

- పరీక్షల కంటే ముందే అడ్మిషన్ల కోసం తంటాలు
- ఇంటర్, ఇంజినీరింగ్ కోర్సుల పేరిట ముందస్తు దోపిడీ
- తల్లిదండ్రులకు పెరిగిన ఫోన్ల తాకిడి

మదనపల్లె సిటీ: టెన్త్, ఇంటర్ చదవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఇప్పుడు ఇలాంటి ఫోన్ల బెడద పెరిగింది. జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి 21,468 మంది పరీక్షలు రాస్తున్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ 15,356 మంది, ద్వితీయ సంవత్సరం 14,248 మంది రాస్తున్నారు. కనీసం వార్షిక పరీక్షలు కూడా పూర్తి కాకముందే కార్పొరేట్ కాలేజీలు ప్రధానంగా మదనపల్లె, రాయచోటి, రాజంపేటతో పాటు మండల కేంద్రాల్లో సైతం బేరసారాలు ప్రారంభించాయి. అడ్డగోలు ఫోన్లు, ఆఫర్లతో తల్లిదండ్రులను అయోమయానికి గురి చేస్తున్నాయి. పరీక్షలు కూడా రాయకుండా అడ్మిషన్లు ఎలా తీసుకోవాలి... తీసుకోకుంటే ఫీజులు ఇంకా పెరుగుతాయేమో అని వారు ఆందోళనకు గురవుతున్నారు. అనుమతి లేకుండా విద్యార్థుల డేటాను సంపాదించి వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తూ వల విసురుతున్నారు. ఫోన్లు కాకుండా వాట్సాప్‌లకు అడ్మిషన్ల మెసేజ్‌లు పంపుతున్నారు. వీటికి ఎక్కువగా తల్లిదండ్రులు ప్రభావితమవుతున్నారు. ముందుగా మేల్కోకుంటే ఫీజులు ఎక్కడ పెంచుతారోనని వారు ఆందోళన చెందుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని అందిన కాడికి దోచుకునేందుకు కార్పొరేట్ ఇంటర్, ఇంజినీరింగ్ కాలేజీలు గాలం వేస్తున్నాయి. ఆకట్టుకునేలా బ్యాచ్‌కో పేరు పెట్టి రంగు రంగుల బ్రోచర్లు చూపి మంచి భవిష్యత్తు అంటూ ఆశల పల్లకిలో విహరింపజేస్తూ రూ.లక్షలో ఫీజులు బాదేస్తున్నారు.

మరో వైపు పీఆర్‌ఓలు...

జిల్లాలో ప్రధానంగా తిరుపతి, విజయవాడ కేంద్రాల కార్పొరేట్ కాలేజీల తరఫున వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్ల కోసం ఆయా విద్యా సంస్థల పీఆర్‌ఓలు రంగంలోకి దిగారు. విద్యార్థుల తల్లిదండ్రులు కొద్దిగా ఆసక్తి కనబర్చినా చాలు విద్యార్థుల ఇళ్ల వద్దకు క్యూ కడుతున్నారు. నామినల్ రోల్ ద్వారా విద్యార్థుల వివరాలు, ఫోన్ నంబర్లు, చిరునామా సేకరిస్తున్నారు. వాటి కోసం సంబంధిత విభాగాల ఇన్‌చార్జిలకు విందులు, నజరానాలు సమకూర్చుతున్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థుల వివరాలు ఎవరికి ఇవ్వరాదు. కానీ కాసులకు కక్కుర్తి పడి కింది స్థాయి సిబ్బంది కొందరు విద్యార్థుల సమాచారం అందిస్తున్నారు. దీంతో పీఆర్‌ఓ ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి బ్రోచర్లు ఇవ్వడం.. కాలేజీల గురించి వివరిస్తూ తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అడ్మిషన్లు ఎక్కువగా చేసిన వారికి ఇన్సెంటివ్ అవకాశం ఉండటంతో పోటీ పడుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

సాధారణంగా పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాలు వెలువడిన తర్వాతనే అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాల ప్రక్రియ నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇక ఈ సారి గత ఏడాది కంటే ఫీజులు అధికంగా చెబుతున్నట్లు తెలుస్తోంది. కనీసం 20 శాతం అధికంగా ఫీజుల దోపిడీకి కాలేజీలు సిద్ధమయ్యాయి.

మార్చి నెలాఖరులోపు లక్ష్యం పూర్తి చేయాలి

- ఏపీఎంఐపీ రాష్ట్ర స్థాయి ప్రత్యేకాధికారి డి.రమేష్



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ ఓఎస్‌డీ రమేష్

రాయచోటి (జగదాంబసెంటర్): మార్చి నెలాఖరులోపు జిల్లా సూక్ష్మ నీటి సాగు పథక లక్ష్యాలను పూర్తి చేయాలని ఏపీఎంఐపీ రాష్ట్ర స్థాయి ప్రత్యేకాధికారి డి.రమేష్ పేర్కొన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని జిల్లా సూక్ష్మ నీటి సాగు పథక కార్యాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీ జిల్లా సమన్వయకర్తలు, మైక్రో ఇరిగేషన్ క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యం 15 వేల హెక్టార్లకు ఇప్పటి వరకు 9339 మంది రైతులకు 9694 హెక్టార్లు అమలు చేశామన్నారు. మిగిలిన లక్ష్యాన్ని క్షేత్ర స్థాయిలో ప్రణాళికలు ఏర్పాటు చేసుకుని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదు చేసుకున్న రైతులకు ప్రాథమిక సర్వేలు చేపట్టి, అంచనాలు పూర్తి చేసి రైతుల వాటా కట్టించాలన్నారు. అంతకు ముందు రామాపురం, వీరబల్లి, రాయచోటి మండలాల్లోని పలు గ్రామాల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన మైక్రో ఇరిగేషన్ పరికరాలను రైతుల పొలాల్లో సక్రమంగా అమర్చారా లేదా అని తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంఐఓ లక్ష్మీప్రసన్న, ఎంఐడీసీ, ఎంఐఈలు, కంపెనీ క్షేత్ర స్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం

బి.కొత్తకోట : మండలంలోని బడికాయలపల్లికి చెందిన వివాహిత (24) అదృశ్యంపై భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు బుధవారం పోలీసులు తెలిపారు. కర్ణాటకలోని శిడ్లఘట్ట తాలుకా గంజికుంటపల్లికి చెందిన వివాహితతో స్థానికుడు బాషాకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఆమె అదృశ్యం కావడంతో అనుమానాలు వ్యక్తం చేస్తూ భర్త ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెట్టుపై నుంచి పడి గాయాలు


గాయపడిన సోమశేఖర్

బి.కొత్తకోట : కొబ్బరి చెట్టుపై నుంచి కింద పడి యువకుడు గాయపడిన ఘటన మండలంలోని కొండకిందపల్లి వద్ద బుధవారం జరిగింది. డేగానిపల్లికి చెందిన సోమ శేఖర్ (35) టెంకాయల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. టెంకాయ చెట్టు ఎక్కి కాయలు దింపుతుండగా ప్రమాదవశాత్తూ జారి కిందపడ్డారు. బాధితుడిని 108 అంబులెన్స్‌లో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆటో ఢీకొని ఒకరికి ..

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్ద జరిగింది. పోలీసుల వివరాల మేరకు... మదనపల్లె పట్టణం నక్కలదిన్నెకు చెందిన భీమ్లా నాయక్ కుమారుడు రవినాయక్ (45) మరో వ్యక్తితో కలిసి ఆటోలో పుంగనూరుకు వెళుతుండగా మార్గ మధ్యంలో సుగాలిమిట్ట వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో రవినాయక్ తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేయించి అనంతరం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై కుక్కను తప్పించబోయి బుధవారం స్కూటర్ బోల్తా పడిందని ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాయచోటి పట్టణానికి చెందిన తిరుపతి చంద్ర, సాయికుమార్ స్కూటర్‌లో వడ్డెపల్లెకు వెళ్లి తిరిగి వస్తున్నారు. చిట్లూరు హరిజనవాడ సమీపంలోకి రాగానే కుక్క అడ్డు వచ్చింది. దానిని.. తప్పించబోయి అదుపు తప్పి స్కూటర్‌పై నుంచి కిందపడ్డారు. ఇద్దరికి గాయాలవడంతో స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మామిడి రైతుకు ఏదీ భరోసా..?

రాష్ట్రంలో మామిడి చెట్ల పెంపకం, మార్కెటింగ్‌లో అన్నమయ్య జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. చిత్తూరు జిల్లాకు సమానంగా అన్నమయ్య జిల్లా మామిడికి ప్రసిద్ధి చెందింది. ఈ సారి మామిడి విక్రయాలకు భరోసా లేకుండా పోతోంది. రాయచోటి, కోడూరులలో మార్కెటింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినా నేటికీ అమలు కాలేదు. కొనుగోలు కోసం దళారుల వైపు చూడాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ సారైనా ప్రభుత్వ పరంగా గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రాయచోటి ప్రాంతంలో పూత దశలో ఉన్న మామిడి చెట్లు

దళారులతో దగా పడుతున్న మామిడి రైతులు

రాయచోటి : అన్నమయ్య జిల్లాలోనే 34వేల హెక్టార్లలో వివిధ రకాల మామిడి తోటలు సాగులో ఉన్నాయి. రాయచోటి, రాజంపేట, కోడూరు, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి నియోజకవర్గాలలో పోటాపోటీగా మామిడి తోటలను సాగు చేశారు. దిగుబడి కూడా జిల్లాలో అధికంగానే ఉంటుంది. తెగుళ్ల బెడదతో రెండేళ్లుగా మామిడి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఈ ఏడాది వాతావరణంలో మార్పులు, వెంటాడుతున్న తెగుళ్లతో పూత, పిందె దశలలో ఉంది. పూత మురిపిస్తున్నా ఆశించిన మేర ఎదుగుదల లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. తెగుళ్ల నివారణకు రైతులు వేల రూపాయలు ఖర్చు చేసి మార్కెట్‌లో లభించిన మందులన్నింటినీ చల్లుతున్నారు. కొంతమంది రైతులు మామిడి పిందెలకు కవర్లు కట్టి రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు.

దళారుల బెడదతో ఇబ్బందులు

సవాళ్ల మధ్య తోటలను కాపాడుకుంటున్నా.. సరియైన గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయట ప్రాంతాల నుంచి వ్యాపారులు, దళారులు రావడం, వారు నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయడం, ఇతర రాష్ట్రాలకు, దేశాలకు తరలించి సొమ్ముచేసుకోవడంతో తాము నష్టపోతున్నామని చెబుతున్నారు. గతంలో ఉన్న మామిడి రైతుల ఉత్పత్తి సమైక్య కేంద్రాలు సక్రమంగా పనిచేయడం లేదనే ఆరోపణలున్నాయి. ఉద్యాన, మార్కెటింగ్ శాఖల మధ్య నెలకొన్న సమన్వయ లోపంతో కొనుగోలుపై స్పష్టత లేకుండా పోయిందనే విమర్శలున్నాయి. గత వైకాపా పాలనలో రాయచోటి, కోడూరులలో మార్కెటింగ్ కేంద్రాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదు. అసలే తెగుళ్ల బెడదతో సక్రమంగా దిగుబడి రావడం లేదని, ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసి న్యాయం చేయాలంటూ మామిడి తోట రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మామిడి రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. మామిడి మామిడి ధరల విషయంలో స్థానిక జ్యూస్ కంపెనీలతో చర్చించడం జరుగుతుంది. తెగుళ్లను నివారించుకొని అధిక దిగుబడులు వచ్చేలా సాగులో తగు మెలకువలు పాటించాలి.

– రవీంద్రబాబు, జిల్లా ఉద్యాన అధికారి

రోడ్డు రోలర్ కింద పడి డ్రైవర్ మృతి


మృతి చెందిన కిరణ్ కుమార్ (34)

ఓబులవారిపల్లె : గోవిందంపల్లి పంచాయతీ, చెన్నకేశవ గుడి సమీపంలోని జాతీయ రహదారి మలుపు వద్ద రోడ్డు రోలర్ కింద పడి డ్రైవర్ దయ్యాల కిరణ్ కుమార్(34) మృతిచెందాడు. బుధవారం మంగళంపల్లి నుండి గాదెల గ్రామానికి రోడ్డు రోలర్ తీసుకొని డ్రైవర్ కిరణ్ కుమార్ బయలుదేరాడు. జాతీయ రహదారిపైకి వచ్చే మలుపు వద్ద రోలర్‌ను అదుపు చేయలేకపోవడంతో కిరణ్ కుమార్ అతను నడిపే వాహనం క్రింద పడి మృతి చెందాడు. మృతుడు కడప పట్టణానికి చెందినవాడు. గత కొద్దిరోజులుగా రోడ్డు కాంట్రాక్టర్ వద్ద రోలర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతునికి భార్య, ముగుగరు పిల్లలు కలరు. మృతదేహాన్ని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

రెండు గడ్డి వాములు దగ్ధం


అగ్నిప్రమాదంలో కాలిపోయిన గడ్డివాములు

రామసముద్రం : మండలంలోని కేసీ.పల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కేసీ పల్లె గ్రామానికి చెందిన ఆర్.చెంగారెడ్డి, పి.చంద్రప్పలకు చెందిన గడ్డివాములకు ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అదుపులోకి రాకపోవడంతో పుంగనూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.60 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు.

పేకాట స్థావరంపై మెరుపుదాడి

- 13 మంది జూదరుల అరెస్ట్
- రూ.2.69 లక్షల నగదు, 3 కార్లు, 15 సెల్‌ఫోన్లు స్వాధీనం

రాయచోటి: పేకాట స్థావరంగా మారిన అన్నమయ్య జిల్లా రాయచోటి పరిధిలో ఎస్పీ స్పెషల్ పార్టీ పోలీసులు నిర్వహించిన మెరుపు దాడులలో 14 మంది పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. రాయచోటి రూరల్ మండలం గుంటిమడుగు సమీపంలోని కె.నాగార్జునరెడ్డి మామిడి తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో జిల్లా ఎస్పీ స్పెషల్ పార్టీ పోలీసులతో స్థావరంపై దాడి చేయించారు. వైఎస్సార్, అనంతపురం జిల్లాలకు చెందిన 14 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వివిధ దారుల్లో పోలీసులకు దొరకకుండా కొందరు పరుగులు తీసినట్లు సమాచారం. పట్టుబడిన వారి నుంచి రూ.2,69,360 నగదు, 15 సెల్‌ఫోన్లు, మూడు కార్లు, ఒక బైకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి బుధవారం జూదరులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు. కాగా పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన సమయంలో పేకాట ఆడుతున్న మరికొందరు పరారయ్యారు. వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. వారిని కూడా త్వరలోనే అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

విచ్చలవిడిగా పేకాట

రాయచోటి కేంద్రంగా పేకాట మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. జిల్లా కేంద్రంలో గంజాయి, ఇతర మత్తు పానీయాల విక్రయాలు జోరుగా సాగుతున్నా పోలీసులు మాత్రం వారిచ్చే మామూళ్ల మత్తులో ఉన్నారనే విమర్శలున్నాయి. రాయచోటి పోలీసుల నిర్లక్ష్యం జిల్లా ఎస్పీ కార్యాలయానికి సవాల్‌గా మారింది. ఆడుతున్న సమాచారం స్టేషన్‌కు అందినా ఎలాంటి దాడులు చేయకపోగా, వారి పేర్లను బయటపెడుతున్నారనే ఆరోపణలున్నాయి. బెల్ట్ షాపులు ఏర్పాటు విషయంలోనూ ఎక్సైజ్ పోలీసుల కంటే సివిల్ పోలీసుల జోక్యం అధికంగా ఉందన్న సమాచారం దావానంలా వ్యాపిస్తుంది. రాయచోటి రూరల్ మండలం మాధవరం పంచాయతీలో రెండు బెల్ట్ షాపులు నిర్వహిస్తుండగా ఒక బెల్ట్ షాపుపై ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి వారం రోజుల కిందట దాడి చేసి కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇదే గ్రామంలో మరో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నా అతనిపై ఎలాంటి చర్యలు లేవని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. మంగళవారం కూడా పేకాట స్థావరంపై దాడి విషయాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వకుండా వెళ్లడంతోనే పేకాట ఆడుతున్న వారు పట్టు పడ్డారని కొంత మంది పోలీసుల నోటీ నుంచి వినిపిస్తున్న మాటలు పట్టణంలో హల్ చల్ చేస్తున్నాయి.

విధుల నుంచి తొలగించారు...
ఆత్మహత్యే శరణ్యం

ముఖ్యమంత్రికి విద్యుత్ శాఖ ఉద్యోగి బహిరంగ లేఖ


గొబ్బూరివారిపల్లి సబ్ స్టేషన్ వద్ద గంగాధర్ సాయి

ఓబులవారిపల్లె : రాజకీయ ఒత్తిడితో ఉన్న ఫలంగా ఉద్యోగం నుంచి తొలగించారని, తనకు ఆత్మహత్యే శరణ్యమని పసుపులేటి గంగాధర్ సాయి ఆవేదన వ్యక్తం చేశారు. కలత చెందిన అతడు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రులు, అధికారులకు బహిరంగ లేఖ పంపారు. బాధితుడి వివరాల మేరకు.. మండలంలోని గొబ్బూరివారిపల్లి 33/11 కెవీ విద్యుత్తు సబ్ స్టేషన్‌లో రాజంపేట మండలం, శేషమాంభపురం గ్రామానికి చెందిన పసుపులేటి గంగాధర్ సాయి పనిచేస్తున్నాడు.

2024 మార్చి నెలలో తాను డ్యూటీలో చేరారు. ఏడాది కాలంగా జీతం ఇవ్వకపోయినా రోజూ విధులకు హాజరువుతూ లాగ్ పుస్తకంలో సంతకాలు చేస్తున్నారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి అభిషేక్ అనే వ్యక్తి సబ్ స్టేషన్‌లోని లాగ్ పుస్తకంలో సంతకాలు చేస్తున్నాడని తెలిపారు. ఈ నెల 17వ తేదీన యథావిధిగా డ్యూటీకి వెళ్లగా తనను షిఫ్ట్ ఆపరేటర్‌గా తొలగించినట్లు ఏఈ తెలిపారన్నారు. ఎందుకు తొలగించారని అడిగితే సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. తనకు 12 నెలలు జీతం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే తనకు ఆత్మహత్యే శరణమని, అధికారులు లేఖనే మరణ వాంగ్మూలంగా పరిగణించాలని రాశాడు. రైల్వేకోడూరు ఏడీ ఈ భాస్కర్ రావును వివరణ కోరగా ఆపరేటర్లు ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్లు తీసుకోవడం, తొలగించడం జరుగుతుందని, తమకు సంబంధం లేదని వారు తెలిపారు.

అక్రమ మద్యంపై నిఘా ఉంచాలి


చీకలబైలు చెక్‌పోస్ట్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మదనపల్లె : నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అక్రమ మద్యం రవాణాపై ఎక్సైజ్ సిబ్బంది నిఘా ఉంచాలని కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి మధుసూదన్ అన్నారు. నియోజకవర్గంలోని రామసముద్రం, చీకలబైలు అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీపై ఎక్సైజ్ సిబ్బంది పలు సూచనలు చేశారు. కర్నాటక నుంచి ఎన్‌డీపీఎల్ మద్యం అక్రమరవాణా జరగకుండా పటిష్టమైన నిఘా కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ భీమలింగ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

కాశినాయన : మండలంలోని పాపిరెడ్డిపల్లె గ్రామంలో ఘర్షణ పడిన అన్నదమ్ములు బోడెపాటి శ్రీను, సుబ్బయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. శ్రీను, సుబ్బయ్యలకు కలిపి మూడు ఎకరాలు భూమి ఉందని, భాగ పరిష్కారాలు కుదరక కోర్టుకు వెళ్లారని తెలిపారు. కోర్టులో కేసు నడుస్తుండగా శ్రీను బుధవారం ఆ పొలంలో షెడ్డు వేసేందుకు వెళ్లాడన్నారు. కోర్టులో కేసు నడుస్తుండగా రేకుల షెడ్డు ఎలా వేస్తావని సుబ్బయ్య అనడంతో మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పది టిప్పర్లు సీజ్

దువ్వూరు : దువ్వూరు గుట్ట నుంచి అక్రమంగా సుద్దను తరలిస్తుండగా.. పది టిప్పర్లు, పొక్లెయిన్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తహసీల్దారు అక్బర్‌బాషా తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గత రెండు రోజుల నుంచి మైదుకూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి టిప్పర్లతో అక్రమంగా సుద్ద తరలిస్తున్నారని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా, మెగా ఇంజినీరింగ్ సంస్థ సుద్ద రవాణా చేస్తోందన్నారు. దీంతో పట్టుకుని పది టిప్పర్లను పోలీసుస్టేషన్‌కు తరలించామని, ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో దొంగలు

లింగాల : మండలంలోని వెలిదండ్ల సమీపంలోని చీని తోటలో ఆరు బస్తాల చీని కాయలు చోరీ చేస్తున్న దొంగలను పట్టుకుని రైతులు పోలీసులకు అప్పగించారు. స్థానికుల వివరాల మేరకు.. మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చీనీ కాయలు చోరీ చేస్తున్న దొంగలను రైతులు గమనించారు. వారు పరారవుతుండగా వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. చీనీ కాయలతోపాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైర్లను దొంగలించినట్లు రైతులు తెలిపారు. లింగాల, బోనాల గ్రామాలకు చెందిన నలుగురు దొంగలతోపాటు, స్కూటీ, ఆటోను పోలీసులకు అప్పగించినట్లు రైతులు తెలిపారు. దీనిపై పోలీసులు విచారిస్తున్నారు.

ఉరివేసుకుని బాలిక ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పిఎస్ పరిధిలో రామకృష్ణ నగర్‌లో నివాసం వుంటున్న చిన్నం రమేష్ కుమార్తె జాహ్నవి (15) కుటుంబ సమస్యలతో బుధవారం ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పదో తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దే వుంటున్న బాలిక ఈ చర్యకు పాల్పడిందని తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవమానించిందని మహిళ హత్య

వేముల : మండలంలోని కె.కె.కొట్టాల సమీపంలో ఈ నెల 2న జరిగిన సింగంశెట్టి పద్మావతి హత్య కేసును పోలీసులు ఛేదించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ ఉలసయ్య, ఎస్సై ప్రవీణ్ కుమార్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. కె.కె.కొట్టాల గ్రామానికి చెందిన సింగంశెట్టి పద్మావతి గ్రామ సమీపంలో ఎనుములు మేపుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి వెళ్లారన్నారు. పద్మావతిని చంపి ఆమె శరీరంపై ఉన్న బంగారు గొలుసు, చెవి కమ్మలు ఎత్తుకెళ్లారన్నారు. మృతురాలి కుమార్తె గోగుల దివ్య ఫిర్యాదు మేరకు విచారించామని తెలిపారు. మృతురాలు సింగంశెట్టి పద్మావతి తనను అవమానకరంగా మాట్లాడుతుండడంతో చంపాలని సింగంశెట్టి రమేష్ నిర్ణయించుకున్నాడన్నారు. ఈ నెల 2న ఎనుములు మేపుకొనేందుకు పద్మావతి వెళ్లగా.. అక్కడికి వెళ్లిన రమేష్ చేతులకు ప్లాస్టిక్ గ్లౌజులు ధరించి తలపై దాడిచేసి చంపాడన్నారు. మెడలో బంగారు గొలుసు, చెవి కమ్మలు అపహరించాడన్నారు. బుధవారం ముద్దాయి సింగంశెట్టి రమేష్‌ను అరెస్టు చేసి అతని వద్ద బంగారు గొలుసు, చెవి కమ్మలను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు వారు తెలిపారు.

ధాత్రి పురస్కారాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కడప కల్చరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిభగల మహిళలకు 2025 సంవత్సరానికి గానూ ధాత్రి పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు చేయనున్నామని వివేకానంద ఫౌండేషన్ అధ్యక్షులు పాపిజెన్ని రామకృష్ణ తెలిపారు. సామాజిక సేవ చేస్తున్నా, మహిళా అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి


పాఠశాల భవనాలను ప్రారంభిస్తున్న ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

సిద్దవటం : కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సిద్దవటం మండలం ఉప్పరపల్లె సాయినగర్‌లో కె.అనిల్‌కుమార్‌రెడ్డి హ్యాపీ కిడ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నూతన భవనాలను ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. చిన్నారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు విద్యా వ్యవస్థను బలోపేతం చేశారన్నారు. మూడేళ్ల పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించి.. పౌష్టికాహారం అందజేశామని తెలిపారు. తమ ప్రభుత్వ హయాలంలో 1, 2వ తరగతుల వరకు ప్రాథమిక విద్య, 3వ తరగతి నుంచి 10+2 వరకు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోనూ పోటీ పరీక్షలకు విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేలా సీబీఎస్సీ సిలబస్ ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఇపుడు కూటమి ప్రభుత్వం ఈ విద్యా విధానాన్ని రద్దు చేసే యోచనలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు సౌమిత్ర, హరిబాబు, పాఠశాల డైరెక్టర్ శివకుమారి, హెచ్‌ఎం శ్రీరాములు, పారిశ్రామిక వేత్త తాజుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : బాకీ చెల్లించలేదనే మనస్థాపంతో కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. చంద్ర కాలనీకి చెందిన రామమూర్తి కుమారుడు రెడ్డి శేఖర్ (32) స్థానికంగా ఓ వ్యక్తికి నగదు అప్పుగా ఇచ్చాడు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో బాకీ చెల్లించమని పలుమార్లు అడిగాడు. అయినా అతను బాకీ చెల్లించకపోవడంతో దానిపై ఇంట్లో సమస్యలు ఏర్పడి గొడవ జరిగింది. మనస్థాపం చెందిన రెడ్డి శేఖర్ కత్తితో పొడుచుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మాజీ సీఎం జగన్ రక్షణ.. కూటమి ప్రభుత్వానికి పట్టదా?


మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట : మిర్చి రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కనీస రక్షణ కల్పించాల్సిన కూటమి ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించిందని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు మిర్చియార్డు రైతుల సమస్య తెలుసుకునేందుకు వెళ్లిన జగన్‌కు కనీసం ఒక్క పోలీసును కూడా రక్షణకు నియమించక పోవడం, కనీసం ట్రాఫిక్ క్లియరెన్స్ చేయక పోవడం దురదృష్టకరం అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయలేదని ఎవ్వరికీ మద్దతు ఇవ్వలేదని అన్నారు. అలాంటప్పుడు ఎన్నికల ఆంక్షలు ఎలా వర్తిస్తాయని ప్రశ్నించారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు కనీసం రూ.20వేలు రైతు భరోసాను అందించలేక పోవడం కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

వక్ఫ్‌బోర్డు పేరుతో భూముల కబ్జా

- అన్ ఆథరైజ్డ్ కమిటీ ద్వారా అక్రమ వసూళ్లు
- మతం ముసుగులో కోట్ల రూపాయల స్కామ్
- ఎమ్మెల్యే అక్రమాలపై ఆర్.పీ.సిసోడియాకు ఫిర్యాదు
- 20కోట్ల మేర లెక్కలు తేల్చాలంటున్న బాధితులు


ఎమ్మెల్యే కబ్జా నుంచి తమ భూములు అప్పగించాలని కోరుతున్న బాధితులు


అద్దెను చందాగా చూపుతూ ఇచ్చిన రసీదు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వక్ఫ్ బోర్డు పేరుతో పట్టణంలోని టిప్పు సుల్తాన్ మైదానంలో భూములు కబ్జా చేసి అనుమతి లేకుండా దుకాణాలు నిర్మించారు... వాటిని సబ్ లీజుకు ఇచ్చేసి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా కోట్ల రూపాయల స్కామ్‌కు పాల్పడుతున్నాడని బాధితులు ఆరోపించారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రారంభానికి వచ్చిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ.సిసోడియాను కలిసి, ఎమ్మెల్యే అక్రమాలపై స్థానికులు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మైసూర్ పాలకుడు టిప్పు సుల్తాన్ నుంచి పట్టణానికి చెందిన వ్యక్తి 20 హవాన్సులకు కొనుగోలుచేశారన్నారు. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వక్ఫ్ బోర్డు పేరుతో భూములను కబ్జా చేశారన్నారు. దుకాణాలు నిర్మించి అద్దె వసూళ్లకు ఆయనే కమిటీ ఏర్పాటు చేశారన్నారు. జామియా మసీదుకు చందా ఇచ్చినట్లుగా రసీదు అందజేస్తున్నారన్నారు. వక్ఫ్‌బోర్డు స్వాధీనం చేసుకున్న ఆస్తుల్లో రికార్డులన్నీ అధికారుల వద్ద ఉంటే, అధికారం చెలాయిస్తూ అద్దెలు వసూళ్లు చేసుకుని కోట్ల రూపాయలు కాజేస్తున్నారన్నారు. వక్ఫ్‌భూముల్లో నిర్మించిన షాపు అద్దెలు అటు ప్రభుత్వానికి, ఇటు యజమానులకు వెళ్లక మధ్యలో ఉన్న వారు కాజేస్తున్నారని వాపోయారు. దాదాపు 20 కోట్ల మేర వసూళ్లకు సంబంధించి లెక్కలు తేలాల్సి ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్‌ను ఆర్టీఐ కింద అడిగితే, అనుమతులు లేవని సమాధానమిచ్చారన్నారు. బెంగళూరు బస్టాండ్ బడేమకాన్ వద్ద 1893 నుంచి పట్టా కలిగినటువంటి సయ్యద్ బాసిద్ బాషాకు చెందిన సర్వే నెంబర్.173లోని 97 సెంట్ల భూమిని ఆక్రమించి ఆధీనంలో పెట్టుకుని, మున్సిపల్ అనుమతి లేకుండా షాపురూములు నిర్మించి అద్దెలు తీసుకుంటున్నారన్నారు. అలాగే సర్వేనెంబర్.171లోనూ స్థలాన్ని కబ్జాచేసి, అనుమతి లేకుండా భవనాన్ని నిర్మించుకున్నారన్నారు. దీనిపై సీసీఎల్ఏ, హైకోర్టు, సింగిల్‌బెంచ్ కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ, స్థలంలోకి ప్రవేశించకుండా దౌర్జన్యం చేస్తున్నారన్నారు. వక్ఫ్ బోర్డును అడ్డం పెట్టుకుని, జిల్లా అధికారులను లోబర్చుకుని, డబ్బు దోచుకుంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్వలాభం చూసుకుంటున్నారన్నారు. ఏడునెలలు కావస్తున్నా..తమకు న్యాయం జరగకపోవడంతో మరోసారి సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి తమ ఆవేదన తెలుపుకొన్నామన్నారు. ఫిర్యాదుచేసిన వారిలో వెంకటరమణ నాయుడు, శంకర్‌రెడ్డి, సయ్యద్ బాసిద్‌బాషా, షరీఫ్, ముస్లిం మహిళలు ఉన్నారు.